క్లుప్తంగా

7వరకు ఆధార్ కేంద్రాల కొనసాగింపు

ఆర్డీఓ శ్రీనివాస్



తాండూరు టౌన్: ఈనెల 7వ వరకు పట్టణంలోని మూడు ఆధార్ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆర్డీఓ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గ ప్రజలకు పట్టణంలోని పాత మున్సిపల్ భవనంలో ఆధార్ కేంద్రాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, ప్రజల అవసరం దృష్ట్యా, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మరో వారం రోజుల పాటు ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయన్నారు. ఈ అవకాశం కేవలం తాండూరు పట్టణం, మండల ప్రజలకు మాత్రమేనన్నారు.

పంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకం!

యాలాల: గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగిసింది. రేపు (శుక్రవారం) నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. కాగా, మండలంలోని పంచాయతీలకు ప్రత్యేకాధికారులను కేటాయించారు. ప్రత్యేకాధికారులు వీరే.. యాలాల(మునీరోద్దీన్, తహసీల్దార్), సంగెంకుర్దు(మల్లమ్మ, జీహెచ్‌ఎం), దేవనూరు(శ్రీకర్‌రెడ్డి, పశువైద్యుడు), గోరేపల్లి(శ్రీధర్), జుంటుపల్లి(రమేష్), అక్కంపల్లి(మహేశ్), పగిడిపల్లి(మోహనక్రిష్ణరెడ్డి), రేళ్లగడ్డతండా(క్రిష్ణ), బెన్నూరు(శివప్రసాద్), జక్కేపల్లి(వీరానందం), హాజీపూర్(చంద్రప్రకాశ్), కిష్టాపూర్(బాల్‌రాజ్), అగ్గనూరు(యాదయ్య), పేర్కంపల్లి(సంతోష్), ఎన్కెపల్లి(ప్రభాకర్‌రావు), లక్ష్మీనారాయణపూర్(ప్రమీల), చెన్నారం(గోపి), తిమ్మాయిపల్లి(సుజాత), బండమీదిపల్లి(ఉజ్వల), దౌలాపూర్(శంకర్), ముకుందాపూర్(పుష్పలీల), కోకట్(సుధాకర్‌రెడ్డి), బషీర్‌మియాతండా(మదన్‌మోహన్), కమాల్‌పూర్(షాబుద్దీన్), రాఘవపూర్(శ్రీనివాస్), విశ్వనాథ్‌పూర్(శ్రీధర్‌రెడ్డి), పగిడియాల(జనార్దన్), అచ్యుతాపూర్(గణేష్), ముద్దాయిపేట(శిరీష), సంగాయగుట్టతండా(బాబు), రాస్నం(యాదగిరి), గంగాసాగర్(వీరేశం), సంగాయిపల్లితండా(శ్రావణ్‌కుమార్), నాగసముందర్(నారాయణరెడ్డి), అన్నసాగర్(ప్రసాద్), అడాల్‌పూర్(శ్రీనివాసులు), బాణాపూర్(లక్ష్మణ్)ల పేర్లతో ఉన్నతాధికారులకు నివేదించామని ఎంపీఓ యాదయ్య తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



గుర్తింపు కార్డులు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

తాండూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మల్కాపూర్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మండలంలో 200 మంది ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగప్ప, కిష్టప్ప, ప్రభాకర్‌చారి, శ్రీనివాస్ ఉన్నారు.

అందుబాటులో వైద్య సేవలు



బస్తీ దవాఖానను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొడంగల్ రూరల్: ప్రజలకు అందుబాటులో సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ఆరోగ్య సమస్యలకు గతంలో మండల కేంద్రానికి వెళ్లేవారమని, గ్రామంలో బస్తీ దవాఖాన ఏర్పాటుతో ఇబ్బందులు తొలగనున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పకీరప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే సంతృప్తి

కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి

బంట్వారం: ప్రజాసేవతోనే జీవితంలో సంతృప్తి కలుగుతోందని కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి అన్నారు. బుధవారం నాటితో ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన కోట్‌పల్లి సర్పంచ్ నక్కల విజయలక్ష్మిని గ్రామస్తులు మర్యాద పూర్వకంగా శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎస్‌ఐ స్రవంతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల పదవీ విరమణ లాగానే , ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారంతా ఐదేళ్ల తర్వాత తప్పుకోవాల్సిందేనన్నారు. విజయలక్ష్మి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బందెయ్య ,ఏఎంసీ మాజీ చైర్మన్ శివానందం పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ ఏదీ?

- పథకం అమలులో జాప్యంపై సభ్యుల నిలదీత
- డబ్బులు తిరిగిచ్చేందుకు సుముఖంగా ఉన్నాం: పశువైద్యాధికారి గీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వసంత

మోమిన్‌పేట: గొర్రెల పంపిణీ కార్యక్రమం ఉంటుందా.. లేదా.. డబ్బులు చెల్లించి 8 నెలలు కావస్తున్నా ఇప్పటికీ అతిలేదు గతిలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తమ వాటా కింద ఒక్కొక్కరు రూ.43.750లు చెల్లించి కలెక్టర్ ఖాతాలో జమ చేశామన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వసంత వెంకట్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అనేక సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచులు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి గీత మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలవదన్నారు. ఎవరైనా రైతులు డబ్బులు కావాలని అడిగితే తిరిగి ఇవ్వడానికి సుముఖంగా ఉన్నామన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ కోసం ప్రభుత్వం మరోనెల గడువు పొడిగించిందని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి సభ దృష్టికి తెచ్చారు. చంద్రాయన్‌పల్లి పంచాయతీకి అనుబంధంగా ఉన్న బిక్కరెడ్డి గూడెం ప్రజల ఓట్లు మోమిన్‌పేట జాబితాలో, రెవెన్యూ మోమిన్‌పేటలోనే ఉంటే వారికి అవసరమైన సర్టిఫికెట్లు, పన్నుల వసూలు, అభివృద్ధి ఎవరు చేయాలని ఆ గ్రామ సర్పంచు అంజయ్య సభ ముందుకు తీసుకువచ్చారు. అలాగే, 296 జీఓ ప్రకారం గ్రామాల్లోని చెరువుల్లో పెంచిన చేపలను పట్టుకొని అమ్ముకొనేందుకు టెండర్లను వేస్తున్నట్లు ఎఫ్‌డీఓ సౌజన్య పేర్కొన్నారు. ఇక్కడ పెంచిన చేపలను ఇక్కడే మార్కెట్‌లో అమ్మాలని సభ్యులు సభలో కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బి.వి జయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మానస, కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ శైలజారెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఏఓ జయశంకర్, ఎంపీఓ యాదగిరి, ఏపీఎం రాజు, ఏపీఓ శంకర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలి



ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ కార్యకర్తలు

తాండూరు రూరల్: కష్టపడ్డ కార్యకర్తకు మాత్రమే ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులు కోరారు. మండలంలోని చంద్రవంచ గ్రామ ఆ పార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూజన మోసిన కార్యకర్తకు అన్యాయం చేయొద్దన్నారు. గెలిచిన తర్వాత చాలా మంది నాయకులు వస్తారని వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. చైర్మన్ పదవి అనంతయ్యకు మాత్రమే ఇవ్వాలన్నారు. అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అనంతయ్య, అంజిలప్ప, బాలకృష్ణ, నర్సింలు, విజయ్, గోపాల్, విజయ్,ఎల్లప్ప, మంజూర్, సుందరప్ప, వెంకట్ రమేష్ ,ఎల్లప్పలు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్లలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో సర్పంచులు అప్పులతోనే పరిపాలన సాగించారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అభ్యున్నతికే ప్రథమ ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

స్థానిక సర్పంచ్ భర్త లక్ష్మారెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో సర్పంచ్ శిరీషాలక్ష్మారెడ్డిని పరామర్శించారు. లక్ష్మారెడ్డి మృతి గ్రామానికి, పార్టీకి తీరని లోటన్నారు. వారికి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మయ్య, ఎఈ మణి కుమార్, ఎంపీడీఓ నాగవేణి, డీసీసీ ఉపాధ్యక్షుడు బీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, ఎంపీటీసీ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

శివమాలధారణ ఎంతో పవిత్రం

కుల్కచర్ల: శివమాలధారణ అత్యంత పవిత్రమైందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. బుధవారం మండలం మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివానంద గురుస్వామికి స్వాగతం పలికి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివమాలధారణ వల్ల చెడు అలవాట్లకు దూరం ఉండటంతో పాటు మానసికంగా పరివర్తనం చెందుతారని అన్నారు. ఆధ్యాత్మికతతో ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత నెలకొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, నాయకులు బాలముకుందం, కృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

దొంగఎన్కేపల్లిని సంజీవనగర్‌గా మారుస్తాం

దోమ: దొంగ ఎన్కేపల్లిని సంజీవనగర్‌గా మార్చి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ భవనాన్ని శంకుస్థాపన చేయడంతో పాటు క్రీడా ప్రాంగాణాన్ని స్థానిక సర్పంచ్ అశోక్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా వాసికావడంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి నూతన బిల్డింగ్‌తో పాటు పల్లె ప్రకృతి వనం , నర్సరీ, డంపింగ్ యాడ్, క్రీమిటోరియం, క్రీడా ప్రాంగాణాలు ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వీధుల్లో సీసీ రోడ్లు, నాలాల నిర్మాణాలను చేపట్టి ప్రజల అవసరాలను తీరుస్తానని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఇంటికి అందేలా శ్రద్ధ చూపుతామన్నారు. కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, ఎంపీటీసీ జంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదవరెడ్డి, మాజీ సర్పంచులు అనంతయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చ జరిగేనా?

- నేడు దౌల్తాబాద్ సర్వసభ్య సమావేశం
- ప్రతీసారి మొక్కుబడిగా నిర్వహణ
- గైర్హాజరవుతున్న పలు శాఖల అధికారులు



దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయం

దౌల్తాబాద్: మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చొరవచూపే మండల సర్వసభ్య సమావేశం ప్రతిసారి నామమాత్రంగా జరుగుతోంది. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశంలో సమస్యలపై చర్చలు జరగకుండానే ముగుస్తుంది. ఈ సారైనా సమావేశం పూర్తిస్థాయిలో నిర్వహించి సమస్యల పరిష్కరానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో అనేక సమస్యలు తిష్ట వేసున్నాయి. నేడు జరిగే మండల సమావేశంలో నైనా ప్రజాప్రతినిధులు అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల గైర్హాజరు..

గతంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రగతి నివేదికలను సైతం ఇవ్వలేదు. సమావేశానికి 17శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా సగానికిపైగా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వసతిగృహ, రోడ్డుభవనాలు, రవాణా, ఎక్సైజ్, ఉద్యానశాఖ తదితర శాఖల అధికారులు ప్రతిసారి డుమ్మా కొడుతున్నారు. అలాగే ,కొన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలు అందించడంలేదు. దీంతో అభివృద్ధి, సంక్షేమ పనులు ఎంతమేర జరిగాయనే తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖల నుంచి చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులపై సమాచారం లేదని సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రధాన సమస్యలు....

- ప్రధానంగా గుముడాల-బిచ్చాల బీటీ రోడ్డు, సుల్తాన్‌పూర్-నాగసార్ రోడ్ల అధ్వానంగా మారాయి.
- పశువైద్యశాల్లో సిబ్బంది ఖాళీలు, మందుల కొరతతో తీవ్ర ఇబ్బందులు
- పలు గ్రామాలకు బస్సు సౌకర్యంలేదు. సర్వీస్‌లను నడిపేలా చూడాలి.
- పీహెచ్‌సీకి అంబులెన్స్ లేక రోగుల అవస్థలు
- పలు పాఠశాలలో అసంపూర్తిగా మన ఊరు-మన బడి పనులు
- ప్రహరీలు లేక పాఠశాలలకు స్థలాలు ఆక్రమణ

ప్రిన్సిపాల్‌కు సన్మానం



కామేశ్వరిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కుల్కచర్ల: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర ఇంటర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆలూరి కామేశ్వరి 'కృష్ణా సొబతి కాలియాకి కహానీ యోం మే చిత్రిత్ నారీ జీవన్ '' అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బుధవారం ఆమె డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆమె రామలింగేశ్వర కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పూర్తి చేసిన ఆమెను కళాశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

ఉద్యమాలతోనే తెలంగాణ వచ్చింది

టీవీవీ రాష్ట్ర నాయకులు



కోదండరాంను కలిసిన టీవీవీ నాయకులు

బొంరాస్‌పేట: నాటి స్వరాజ్యం నుంచి నేటి స్వరాష్ట్రం వరకు పోరాటాలు, ఉద్యమాలతోనే సిద్ధించాయని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర నాయకులు అన్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ కోదండరాంను టీవీవీ రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిసి టీవీవీ నాయకులు అభినందించారు. పదేళ్ల క్రితం నీళ్ల, నిధులు, నియామకాలనే నినాదంతో స్వరాష్ట్రం కోసం జాతీయ స్థాయికి వెళ్లి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వం గుర్తించి సముచిత స్థానం కల్పించేందుకు యోచించడం హర్షనీయమన్నారు. ఆయన వెంట టీవీవీ రాష్ట్ర ప్రతినిధులు లక్ష్మి, విజయలక్ష్మి, వనం సుమరంజిత, నాయకులు, జిల్లా అధ్యక్షుడు వెంకటరాములు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు గోపాల్, అనిల్ కుమార్, జిల్లా నాయకులు సదానందం, బసిరెడ్డి, మాధురి, టీజేఏసీ కొడంగల్ నియోజకవర్గ కన్వీనర్ గౌరారం బాలమణి ఉన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా

తాండూరు రూరల్: తనపై నమ్మకంతో గెలిపించిన బిజ్వార్, బొంకూర్ గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని సర్పంచ్ ద్యావరి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బిజ్వార్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్‌ను గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.

విహారయాత్రలతో విజ్ఞానం



విహారయాత్రలో విద్యార్థులు

కొడంగల్ రూరల్: విహారయాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని హెచ్‌ఎం క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విహారయాత్రలకు వెళ్లారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి, మయూరిపార్కు, మన్యంకొండ, పిస్తాహౌజ్ తదితర పర్యాటక ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడి విశేషాలను వివరించారు. హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ, జెడ్పీటీసీ

డీఎస్పీ శేఖర్‌గౌడ్

పెద్దేముల్: ప్రతి ఆటలో క్రీడాకారులు ముందు డాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. బుధవారం తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆటలో ప్రతి ఒక్కరూ విజేతలుగా నిలుచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ధారాసింగ్ మాట్లాడుతూ.. తనకు పదవి ఉన్నా... లేకున్నా క్రీడలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. క్రీడల్లో మొత్తం 16 టీంలు, 1100 మంది పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అండర్-14, అండర్-17 విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ ఖోఖోతో పాటు అథ్లెంటిక్స్- జమ్స్, రన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ఎల్లారెడ్డి,హెచ్‌ఎంలు శంకర్, అక్కమదేవి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గోపాలక్రిష్ణ, మండల కో-ఆప్షన్ సభ్యుడు నసీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీన్‌కుమార్, మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, మాజీ ఎంపీటీసీవిద్యాసాగర్ నాయకులు అందచేశారు.

సంక్షిప్త వార్తలు

జీహెచ్‌ఎంకు ఘన సన్మానం

యాలాల: మండలంలోని పగిడియాల ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయినా జీహెచ్‌ఎం పార్వతీదేవికి బుధవారం గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. గతంలో చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బసిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జియాఉద్దీన్, మహమూద్ తదితరులు ఉన్నారు.

తూము లీకేజీకి మరమ్మతులు చేయించండి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హస్నాబాద్ పెద్ద చెరువు తూము లీకేజీ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చెరువు కట్ట తూమును పరిశీలిస్తూ నీటిపారుదల శాఖ డీఈ కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన తూము దగ్గరకు చేరుకొని పరిశీలించారు. యాసంగి పంట సాగులో భాగంగా రైతులు నీటిస్థాయిని పెంచుకోవడంతో తూముకు ఉన్న బోల్ట్ దెబ్బతిన్నదని, రెండు రోజుల్లో సరిచేయిస్తామని చెప్పారు. పెద్ద ప్రమాదమేమీ లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం తూము లీకేజీకు మరమ్మత్తు చేయించాలని రైతులు డీఈ కిరణ్‌కు వినతిపత్రం అందించారు.

ఘనంగా గద్దర్ జయంతి

కుల్కచర్ల: ప్రజాయుద్ధ నౌకగా పేరొందిన గద్దర్ జయంతిని చౌడాపూర్‌లో పూలె అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, గిర్దవరి వెంకటగిరి, సంఘ నాయకులు వెంకటేష్, బి.రాము, లింగయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, సలీం, బొర్ర రమేష్, మణికంఠ, యాదయ్య,పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు సహజం

దోమ : ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య అన్నారు. పాఠశాలలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు నర్సింహులు ఇటీవలే వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు బుధవారం ఆయనకు పాఠశాల ఉపాధ్యాయులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ప్రతి ఉపాధ్యాయు డికి బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు రేణుక, శోభ పాల్గొన్నారు.

సర్పంచుకు పౌరసన్మానం

బషీరాబాద్: ఐదేళ్ల పాటు ప్రజాసేవ చేసి పదవీ కాలం ముగియడంతో బుధవారం బషీరాబాద్ పంచాయతీ ప్రథమ పౌరురాలు ప్రియాంకకు గ్రామస్తులు పౌర సన్మానం చేశారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా, మహిళా సర్పంచ్‌గా ప్రియాంక చేసిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. ఎంపీపీ కరుణ, ఎంపీటీసీ రేఖ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్ మహరాజ్, శంకరప్ప తదితరులు సర్పంచ్ ప్రియాంక, శ్రావణ్ దంపతులను గజమాలతో సన్మానించారు. వార్డు సభ్యులకు సైతం గ్రామస్తులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.

పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి

నవాబుపేట: పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్లో పార్టీ ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పని చేసిన ప్రతి కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య , బి బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'దళితబంధు'ను కొనసాగించండి

దోమ: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని దళితబంధు మండల కో ఆర్డినేటర్ దత్తు డిమాండ్ చేశారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ పురుషోత్తం, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జయరాంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ దళితబంధు పథకాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని దళితుల జీవితాల్లో వెలుగు నిపుతుంటే, ప్రస్తుత ప్రభుత్వం దళితబంధు పథకాన్ని నిలిపివేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో దళితుల సంఘాల నేతలు అంజిలయ్య, ఆదిత్యా, రమేశ్‌కుమార్, కృష్ణయ్య, నర్సింహులు, మహేశ్, యాది పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుబంధ బ్యాంకులతో లబ్ధి

కుల్కచర్ల: ప్రభుత్వ అనుబంధ బ్యాంకుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లవకుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో లోన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ఆధ్వర్యంలో అతి తక్కువ రేట్లలో హౌజ్‌లోన్లు, కారులోన్లు అందుబాటులో ఉన్నాయని వినియోగదారులు, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే పోరాటం

పరిగి: కార్మికుల సమస్యలను పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆశవర్కర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయన్నారు. కేంద్రం విధానాలతో దేశవ్యాప్తంగా కార్మికులు నష్టపోతున్నారన్నారు. సమ్మెలో కార్మిక సంఘాలు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఓటరు నమోదు పక్కాగా ఉండాలి

బంట్వారం: కొత్తగా ఓటరు నమోదు, అడ్రస్ మార్పు ,పేర్లు తొలగింపు లాంటి ప్రక్రియ సక్రమంగా ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటును దుర్వినియోగం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు విజయ్‌భాస్కర్ ,తులసీరామ్ ,బీఎల్‌ఓలు పాల్గొన్నారు.